స్నాతకోత్సవానికి ఏయూ ముస్తాబు

- 9న స్నాతకోత్సవం
- హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్


వేదిక ఎదురుగా సీటింగ్


సిద్ధమవుతున్న వేదిక


.గ్రీన్ రూమ్‌ను సిద్ధం చేస్తున్న కార్మికులు

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయం 87,88,89,90 సంయుక్త స్నాతకోత్సవం ఈ నెల 9వ తేదీన జరగనుంది. దాదాపు నాలుగేళ్ల తరువాత జరగనున్న ఈ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చాన్సలర్ హోదాలో హాజరవుతున్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై సుమారు మూడు గంటలకు పైగా స్నాతకోత్సవం జరగనుంది. స్నాతకోత్సవం నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే కట్టమంచి రామలింగారెడ్డి స్నాతకోత్సవ మందిరాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

స్నాతకోత్సవంలో సుమారు 690 మంది డాక్టరేట్లు అందుకోనున్నారు. వీరితో పాటు బంగారు పతకాలు, ప్రైజ్‌లు సాధించిన వారు 600 మంది వరకు ఉన్నారు. దీనితో వేదికపై పట్టాలు, ప్రైజ్‌లు, మెడల్స్ తీసుకునే వారు 1,290 మందికి పైగా ఉంటారు. వీరితో పాటు వారి కుటుంబ సభ్యులు సైతం అదే సంఖ్యలో కార్యక్రమానికి హాజరవుతారు. అతిథులు, ఆహ్వానితులు కార్యక్రమంలో పాల్గొంటారు. దీనికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు.

కార్యక్రమం జరిగే స్నాతకోత్సవ మందిరాన్ని సరికొత్తగా తీర్చిదిద్దుతున్నారు. సభా వేదికతో పాటు గవర్నర్ కోసం ప్రత్యేకంగా ఒక గ్రీన్ రూంను సిద్ధం చేస్తున్నారు. గవర్నర్‌తో పాటు ఇతర అధికారులు ధరించే ప్రత్యేకమైన స్నాతకోత్సవ వస్త్రాలు ఇప్పటికే సిద్ధం చేశారు. వేదికపై రాష్ట్ర గవర్నర్, ఉపకులపతి, ముఖ్య అతిథి, గౌరవ డాక్టరేట్‌లు అందుకునే వారు ఆశీనులు కావడానికి ప్రత్యేకమైన కుర్చీలను సైతం సిద్ధం చేశారు. వీటిని కేవలం స్నాతకోత్సవ సమయంలో మాత్రమే వినియోగిస్తారు. ఇప్పటికే వీటికి సభావేదిక వద్దకు తీసుకువచ్చారు. సభా వేదిక, ప్రాంగణంలో భారీ శీతలీకరణ యంత్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు.

2500 మంది వీక్షణ

స్నాతకోత్సవ మందిరంలో జరిగే కార్యక్రమానికి దాదాపు 2500 మంది వరకు ప్రత్యక్షంగా వీక్షిస్తారు. దీనికి అనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ అభ్యర్థికి ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కేటాయించి, ముందుగానే వారికి తెలియజేస్తారు. వారికి కేటాయించిన స్థానాలలో మాత్రమే వారు కూర్చోవాలి. అదే విధంగా డాక్టరేట్ తీసుకునే వారితో పాటు ఒకరిని అనుమతిస్తారు. వారికి వేరుగా సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి అనుగుణంగా ఇప్పటికే వేదిక ఎదురుగా సీటింగ్ ఏర్పాట్లను ప్రారంభించారు. శుక్రవారం మధ్యాహ్నానికి పూర్తిస్థాయిలో వేదికను సిద్ధం చేసే దిశగా సిబ్బంది పనిచేస్తున్నారు. సాయంత్రం స్నాతకోత్సవం మందిరాన్ని ఏయూ ఉన్నతాధికారులు సందర్శించి, పనులను పరిశీలిస్తారు.

స్నాతకోత్సవ మందిరం చుట్టూ సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే చుట్టూ ఉన్న రహదారులను మరమ్మతులు చేయడం, కొత్తవాటిని నిర్మించడం పూర్తి చేశారు. స్నాతకోత్సవ మందిరం వెనుక భాగంలో ఉన్న పిచ్చి మొక్కల తొలగించి, చెట్లకు ప్రూనింగ్ పనులు పూర్తిచేశారు. పారిశుధ్య సిబ్బంది ఎప్పటిప్పుడు వ్యర్థాలను తొలగించి, తరలిస్తున్నారు.

కృష్ణా..ముకుందా మురారీ


ఉయ్యాల సేవలో పాల్గొన్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పరిధి తోటగరువులో శ్రీకృష్ణుడి ఆలయాన్ని గురువారం ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ సందర్శించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, స్థానిక నాయకులుతో కలిసి పాల్గొని స్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి పూజలు చేయించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు ఇక్కడ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

సందడే సందడి

ఎంవీపీకాలనీలో శ్రీ సత్యసాయి విద్యా విహార్‌లో గురువారం కృష్ణాష్టమి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ, ఫస్ట్ స్టాండర్డ్ చదువుతున్న చిన్నారులు శ్రీకృష్ణుడు, యశోధర, గోపికలు వేషధారణలో అలరించారు. ఇక్కడ ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో ఉట్టి కట్టి ఆ చిన్నారులతో కొట్టించారు. పిల్లలు ఆలపించిన కృష్ణుడి పాటలు, నృత్యాలు అలరించాయి.


ఆరిలోవలో చిన్నికృష్ణుడి సందడి

నేడు నందోత్సవం

బీచ్‌రోడ్డు: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ఉయ్యాల సేవలో పాల్గొన్నారు. శ్రీకృష్ణాష్టమి మరుసటి రోజు నంద మహారాజుకు పుత్రుడు జన్మించడంతో ఆ రోజున నందోత్సవ జరుపుకోవడం ఆనవాయితీ అని నిష్క్రించిన భక్తదాస అన్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి ఈ ఉత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీభక్తి వేదాంత స్వామికి అభిషేకం, 1,008 వంటకాలతో ప్రసాదం సమర్పిస్తామన్నారు.

చిన్నారుల కోలాటం

మద్దిలపాలెం: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా పిఠాపురంకాలనీలోని సాయిబాబా మందిరం వద్ద చిన్నారులు కోలాటంతో సందడి చేశారు. సాయంత్రం చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణలో సాయిబాబా మందిరం వద్ద కోలాటం చేస్తూ అలరించారు.


పూజలు చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు


పిఠాపురంకాలనీ సాయిబాబా మందిరం వద్ద చిన్నారులు కోలాటం


సత్యసాయి విద్యావిహార్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు

సింహాద్రిపురంలో..

శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా జీవీఎంసీ 15వ వార్డులో సింహాద్రిపురంలో యువకులు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు వీఎంఆర్‌డీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పడాల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డు: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నగరవాసులు ఘనంగా జరుపుకున్నారు. బీచ్‌రోడ్డులోని గోకుల్ పార్క్ వద్ద ఉన్న శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఉదయం 5 గంటల నుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు.

క్లుప్తంగా

బాలుర పరిశీలన గృహంలో వైద్య పరీక్షలు


రక్త పరీక్ష చేస్తున్న కేజీహెచ్ వైద్య సిబ్బంది

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం దీన్‌దయాల్‌పురంలో ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహంలో గురువారం కేజీహెచ్ వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా ఇక్కడ బాలుర ఆరోగ్యపరమైన సమస్యలు గురించి సూపరింటెండెంట్ వీరయ్యను అడిగి తెలిసుకొన్నారు. అనంతరం బాలురకు ఎస్టీ, టీబీ, హెచ్ఐవీ, ఆర్‌పీఆర్, బీహెచ్‌వీ, హెచ్‌సీవీ తదితర రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కేజీహెచ్ వైద్య విభాగం కౌన్సిలర్ బి.సూర్యారావు, ల్యాబ్ టెక్నీషియన్ ఎల్.తిరుమలరావు, సిబ్బంది ఐ.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


రాములమ్మకు నివాళులర్పిస్తున్న ఎంవీవీ సత్యనారాయణ

బీచ్‌రోడ్డు: కార్యకర్తలకు ఎప్పుడూ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఎంపీ, పార్టీ విశాఖ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 22వార్డులోని ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త రాములమ్మ కుటుంబానికి గురువారం ఎంపీ ఆర్థిక సాయం చేశారు. కార్యకర్తల కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి బీచ్‌కు క్లీనింగ్ యంత్రం


బీచ్‌లో చెత్త తొలగిస్తున్న క్లీనింగ్ యంత్రం

భీమునిపట్నం: భీమిలి పరిధిలోని బీచ్ ఇసుకలో చెత్తను తొలగించడానికి కొత్తగా బీచ్ క్లీనింగ్ యంత్రాన్ని జీవీఎంసీ అందించగా గురువారం పనులు ప్రారంభమయ్యాయి. దీంతో పాటు సాగర్‌నగర్, ఆర్‌కే బీచ్ ప్రాంతాలకు రెండు యంత్రాలు అందించారు. కాగా భీమిలి తీరం నుంచి తిమ్మాపురం వరకు రోజూ తీరంలోని చెత్తను ఈ యంత్రం తొలగిస్తుంది. పారిశుధ్య సిబ్బంది బీచ్ ఇసుకలో చెత్తను తొలగించడానికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అధికారులు ఈ యంత్రాన్ని అందించారు. ట్రాక్టర్ వెనుక తొట్టి, దానికి ఒక బ్రష్ లాంటిది ఉండగా... ఇది వెళ్తున్న ప్రాంతంలోని చెత్తను తొట్టి లోపలకు లాగేసుకుంటుంది. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ చెత్తను సేకరించడానికి వీలుంటుంది.

గుర్రంపాలెం హెల్త్ క్లినిక్ సందర్శన

సింహాచలం : గుర్రంపాలెం విలేజీ హెల్త్ క్లినిక్‌ను గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తనిఖీ చేశారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే పెందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఎంసీహెచ్ సేవలు, కంటి వెలుగు స్క్రీనింగ్ క్యాంప్స్, వ్యాధి నిరోధక టీకాలు, ల్యాబ్ పరికరాలు, మందులు, ఫ్రైడే–డ్రైడే గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ–ఆశా లాగిన్స్, ఎన్‌సీడీ సర్వేపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈహెచ్ఆర్, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. గర్భిణులను గుర్తించి టీటీ అందజేయాలని తెలిపారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వైద్యుల సలహా మేర ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలని తెలిపారు.

తప్పిన ప్రమాదం


కాలిపోయిన స్విచ్‌బోర్డు

ఆరిలోవ: జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి సూర్యతేజానగర్‌లో గురువారం సాయంత్రం విద్యుత్ ప్రమాదం జరిగింది. ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకొన్నారు. స్థానికుల తెలిపిన వివరాలు ప్రకారం..విశాలాక్షినగర్ ఫీడర్‌కు చెందిన 33 కేవీ హెవీలైన్‌కు వెళ్లే టవర్లు సూర్యతేజానగర్ మీదుగా విద్యుత్ విభాగం అధికారులు వేశారు. ఈ తీగలు కిందన కొన్ని నివాసాలు ఉన్నాయి. హెవీలైన్ తీగలు కావడంతో తరుచూ ఇక్కడ పెద్ద శబ్దాలు వస్తుంటాయి. గురువారం సాయంత్రం తీగల కింద ఉన్న ఓ ఇంటి ఎర్త్‌వైర్ తెగిపోయి గోడపక్కన నుంచి వేలాడింది. ఆ తీగకు పైనుంచి వెళ్లే హెవీలైన్ తీగలు పవర్ కనెక్ట్ కావడంతో పెద్ద శబ్దం వచ్చి మంటలు రేగాయి. దీంతో మూడు ఇళ్లల్లో ఫ్యాన్‌లు, స్విచ్ బోర్డులు, బల్బులు పాడయ్యాయి. అనంతరం విద్యుత్ శాఖ సిబ్బంది ఆ మూడిళ్లలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ఉత్తమ కస్టమర్‌గా ఏపీ స్వర్ణకార సంఘం


వేణుమాధవ్‌ను సత్కరిస్తున్న మేనేజర్ రామ్మోహన్

బీచ్‌రోడ్డు: ఉత్తమ కస్టమర్‌గా ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘాన్ని బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఈ మేరకు గురువారం సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్‌ను బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్ణ ట్రేడ్ సెంటర్ బ్రాంచ్ మేనేజర్ రామ్మోహన్ ఘనంగా సత్కరించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా 118వ వార్షికోత్సవాన్ని బ్రాంచ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం నగర అధ్యక్షుడు ముదపాక రవి, ప్రధాన కార్యదర్శి పెద్దపూడి బ్రహ్మాజి తదితురలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న డాక్టర్ పద్మినీ దేవి

ఏయూక్యాంపస్: జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు గాయత్రి విద్యా పరిషత్ వైద్య కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం బీచ్‌రోడ్ లోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆస్పత్రి సీనియర్ వైద్యులు పద్మినీదేవి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజానికి పౌష్టికాహారం అవసరమన్నారు. ఆధునిక ఆహార అలవాట్లకు స్వస్తి చెప్పి సహజ ఉత్పత్తులు, రసాయనాలు లేని ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పలు నమూనాలను విద్యార్థులు తయారు చేయగా, ఆమె వీటిని పరిశీలించి ఉత్తమ నమూనాలకు బహుమతులు అందజేశారు. పాఠశాల స్థాయి నుంచి మంచి ఆహార అలవాట్లను కలిగి ఉండాలని సూచించారు. సమతుల ఆహారం తీసుకోవాల్సిన అవసరాన్ని పలు ఉదాహరణలో వివరించారు. శరీరంలో పౌష్టికాహార లోపం ఫలితంగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, వారి పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల డాక్టర్లు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పౌష్టికాహార వీడియోలు అందర్నీ ఆకర్షించాయి. ఈ ఉత్సవాలు ఈనెల 13వ తేదీ వరకు కొనసాగుతాయని పద్మినీ దేవి తెలిపారు.

పంచగ్రామాల భూ సమస్య పరిష్కరించాలి


పాదయాత్ర చేస్తున్న సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం నాయకులు, బాధితులు

సింహాచలం : పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తామని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెప్పిందని, అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలైనా పరిష్కరించలేదని సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ప్రతినిధులు విమర్శించారు. భూ సమస్య పరిష్కారం కోరుతూ సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భూసమస్య బాధితులు, ప్రజలు, ఇళ్ల యజమానులు గురువారం సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా నుంచి గోపాలపట్నంలోని పెట్రోల్ బంక్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు మాట్లాడుతూ దశాబ్దాల క్రితం నిర్మితమైన ఇళ్లు శిథిలావస్థలో ఉన్నా వాటిలోనే జీవనం సాగించాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా భూసమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.రమణి, సీహెచ్ గోపాలకృష్ణ, ప్రతాప్, అరుణ్ కుమార్, కోటేశ్వరరావు, రమణ, నారాయణరావు, కృష్ణారావు, శంకరరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, పంచగ్రామాల కాలనీ నాయకులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు అమలు తీరు పరిశీలన


వేంకటేశ్వరమెట్ట–1 సచివాలయంలో ఓటరు నమోదు వివరాలు తెలుసుకుంటున్న జేసీ

అల్లిపురం : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం అమలు కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. గురువారం ఉదయం వేంకటేశ్వరమెట్ట–1 సచివాలయ పరిధిలో నిర్వహించిన ఓటరు సర్వే కార్యక్రమ నిర్వహణను దగ్గరుండి పరిశీలించారు. ఓటర్ల నమోదుకు సంబంధించి బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఓటర్ల చేరికలు, తొలగింపులు, ఒకే డోరు నంబర్‌లో 10 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ఫామ్–6 ద్వారా నూతన ఓటర్ల నమోదు, ఫామ్ 6 (బి), ఫామ్–7, ఫామ్–8 ద్వారా ఓటర్ల జాబితా వివరాలలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలని ఆయన వివరించారు. పొరపాట్లకు తావీయకుండా పారదర్శకంగా అర్హులందరి ఓట్లు నమోదయ్యేలా జాగ్రత్త వహించాలన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో స్టూడెంట్ కౌన్సిల్ ఉత్సవాలు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో 66వ స్టూడెంట్ కౌన్సిల్ ప్రారంభోత్సవ వేడుకలు గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. కొత్త విద్యా సంవత్సరంలో చేరిన ఇంటర్, డిగ్రీ ఫస్టియర్ విద్యార్థినులను స్వాగతిస్తూ ఫ్రెషర్స్ డే వేడుకలు జరిపారు. ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారిణి వైవీ అనురాధ పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో స్వయం నిర్ణయాత్మక శక్తి పెరిగినప్పుడే సాధికారత పొందినట్లు అన్నారు. కళాశాలతో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

వ్యాయామం, యోగా, ధ్యానంతో ఆరోగ్యం



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ఆరోగ్యకరమైన అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటితో ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉండవచ్చని డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. రైల్వే ఉద్యోగులు, సిబ్బంది కోసం వాల్తేర్ డివిజన్ ప్రేరణ పేరుతో గురువారం దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే మానసిక ప్రశాంతత, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని ఉద్యోగులకు సూచించారు. హెల్త్ మేనేజ్‌మెంట్, మేనేజ్‌మెంట్ టెక్నిక్స్‌ను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రేరణాత్మకమైన కేస్‌స్టడీల ద్వారా పలు విషయాలు వెల్లడించారు. అనంతరం రైల్వే ఉద్యోగులు అడిగిన ప్రశ్నలకు సూర్యారావు సమాధానమిచ్చారు. ఈ సమావేశాల ద్వారా సిబ్బందిలో మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం కలిగిస్తూ, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ఇటువంటి సెమినార్‌లకు ప్రజలను ప్రభావితం చేసిన, చేస్తున్న పలువురు ప్రత్యేక వ్యక్తులను తీసుకొచ్చి వారి అనుభవాలు, ఆలోచనలు, సూచనలు, సలహాలు ఉద్యోగులకు తెలిసేలా చేస్తూ వారిలో నూతనోత్సాహాన్ని నింపుతున్నట్లు చెప్పారు. అనంతరం డాక్టర్ కూటికుప్పలను డీఆర్‌ఎం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), వివిధ విభాగాలకు చెందిన బ్రాంచి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న జడ్జి గంగరాజు


శ్రీవారి సన్నిధిలో జడ్జి గంగరాజు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ముందుగా అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీవారి ప్రసాదాన్ని ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శివ అందజేశారు.

ఘనంగా సహస్ర తులసి పూజ


సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే అమ్మవారి త్రికాల పంచామృతాభిషేకం సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న శ్రావణలక్ష్మీ పూజలు గురువారం 22వ రోజుకి చేరాయి. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సింహగిరీశుడికి స్వర్ణ పుష్పార్చన


స్వర్ణపుష్పార్చన నిర్వహిస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు

సింహాచలం: సింహగిరీశుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన నేత్రపర్వంగా జరిపించారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడామండపంలోని వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణాన్ని గురువారం కనులపండువగా జరిపించారు. ఆలయ కల్యాణమండపంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేపజేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.